బియ్యం నాణ్యతను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ జె.శ్రీనివాస్

ఫిలిప్పీన్స్‌కు బియ్యం సరఫరా ఆలస్యమైతే చర్యలు

- అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్

నందికొండ, ఫిబ్రవరి 28 : రాష్ట్ర ప్రభుత్వ ఒప్పందంలో భాగంగా జిల్లా నుంచి ఫిలిప్పీన్స్ దేశానికి బియ్యం ఎగుమతి చేస్తున్నామని, ఆ దేశానికి బియ్యం డెలివరీలో అలసత్వం వహిస్తే మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని అడిషనల్ కలెక్టర్ జె. శ్రీనివాస్ అన్నారు. హాలియాలోని వజ్రతేజ రైస్ మిల్ నుంచి ఫిలిప్పీన్స్ దేశానికి ఎగుమతి అవుతున్న బియ్యం నాణ్యతను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. 5 శాతం బ్రోకెన్‌తో ఆ దేశానికి బియ్యాన్ని ఎగుమతి చేస్తున్నామని, యాసంగిలో మిల్లర్లకు 2023-24 సంవత్సరానికి గాను 80.769 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అందజేసినట్లు తెలిపారు. అందులో భాగంగా 1,906 ఏసీకేల సీఎంఆర్ డెలివరీ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 1,594 ఏసీకేల బియ్యాన్ని పంపినట్లు పేర్కొన్నారు. ఇంకా 312 ఏసీకేల బియ్యాన్ని మిల్లర్లు డెలివరీ చేయాల్సి ఉందని, మార్చి 17 లోపు ఆ బియ్యాన్ని కూడా డెలివరీ చేయాలని లేదంటే మిల్లర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. 2024-25 ఏడాదికి గాను వానకాలం పంట బియ్యం డెలివరీ కూడా వేగంగా చేయాలని సూచించారు. ఆయన వెంట డీసీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, డీఎం హరీశ్, రైస్ మిల్లర్స్ గౌరవ అధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి, డీటీ ముక్తార్ ఉన్నారు.

భవిష్యత్ సైన్స్‌దే..

- బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర సభ్యుడు పొనుగోటి అంజన్‌రావు

మర్రిగూడ : దామెరభీమనపల్లి పాఠశాలలో విద్యార్థుల సైన్స్ ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర సభ్యుడు పొనుగోటి అంజన్‌రావు

మర్రిగూడ, ఫిబ్రవరి 28 : భవిష్యత్ అంతా సైన్స్‌దేనని, పాఠశాల స్థాయిలోనే విద్యార్థులతో ఆవిష్కరణలు చేయించాలని బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర సభ్యుడు పొనుగోటి అంజన్‌రావు అన్నారు. మండలంలోని దామెరభీమనపల్లిలో గల ప్రాథమిక, ఉన్నత, అంగన్‌వాడీ పాఠశాలలను జిల్లా అధికారులతో కలిసి శుక్రవారం ఆయన సందర్శించారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు చేసిన సైన్స్ ప్రదర్శనను మెచ్చుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి ఉపాధ్యాయులు, కార్మికులకు సూచనలు చేశారు. బాలల అభిరుచిని బట్టి విద్యా బోధన జరిగినప్పుడే మంచి ఫలితాలు సాధించవచ్చని వెల్లడించారు. ఆయన వెంట జిల్లా సంక్షేమశాఖ పీడీ కృష్ణవేణి, ప్రొటెక్షన్ అధికారి గణే, బాలల పరిరక్షణ సమితి జిల్లా చైర్మన్ చింత కృష్ణ, సీడీపీఓ సక్కుబాయి, ఎంఈఓ శ్రీనివాస్, హెచ్‌ఎం.లచ్చిరాం, సూపర్‌వైజర్ యశోద ఉన్నారు.

హాలియా : పట్టణంలోని న్యూకిడ్స్, లక్ష్య, టైమ్ పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకున్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ రామకృష్ణ, ఎంఈఓ గుండా కృష్ణమూర్తి, ఆయా పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

చిట్యాల : జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు సైన్స్ ప్రయోగాలు చేశారు. సర్ సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పించారు. చిట్యాల, గుండ్రాంపల్లి, జడ్పీహెచ్‌ఎస్ ఆరెగూడెం యుపీఎస్‌లలో కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో జి.మాధ వి, బి.మధుమతి, చిలకరాజు శ్రీనివాస్, ఏ.పద్మజ, కోణం శ్రీనివాస్, ఆరెడ్ల వెంకట్‌రెడ్డి, ఎం.అండాలు, వెంకట్‌రావు, అఫ్జల్ షరీఫ్, రాంరెడ్డి, కే.రేవతి, సత్యపాల్, పీ.సుధాకర్‌రెడ్డి, అరుణ పాల్గొన్నారు.

గుర్రంపోడ్ మోడల్ స్కూల్‌లో సైన్స్ డే ఆకారంలో విద్యార్థుల ప్రదర్శన

చిట్యాల జడ్పీహెచ్‌ఎస్‌లో ప్రదర్శనలు తిలకిస్తున్న విద్యార్థులు

పంచాయతీ కార్యదర్శుల మండల కమిటీ ఎన్నిక

తిరుమలగిరి మండల పంచాయతీ కార్యదర్శుల నూతన కమిటీ

తిరుమలగిరి, ఫిబ్రవరి 28: తిరుమలగిరి మండల పంచాయతీ కార్యదర్శుల నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా నలబోలు నాగలక్ష్మి, ఉపాధ్యక్షుడిగా పందిరి మధుకర్, జనరల్ సెక్రటరీగా పి.కిరణ్, ట్రెజరర్‌గా దార సరిత, మీడియా కన్వీనర్‌గా ఇర్ఫాన్‌తో పాటు కార్యవర సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంపీఓ భీమ్‌సింగ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'శ్రామిక మహిళా పోరాట దినోత్సవాన్ని' గ్రామగ్రామాన జరపాలి

సమావేశంలో మాట్లాడుతున్న పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సమ్మ

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 28: అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినోత్సవాన్ని మార్చి 1 నుంచి 8వ తేదీ వరకు గ్రామగ్రామాన జరపాలని పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల నర్సమ్మ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇంటా, బయట మహిళలపై అంతులేని వివక్ష, అణిచివేత కొనసాగుతున్నదని, లైంగిక హింస పెరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ కేంద్రంగా త్వరలో జరగనున్న ప్రపంచ అందాల పోటీలను వ్యతిరేకిస్తున్నామని, వాటిని అడ్డుకుంటామని తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షురాలు రామలింగక్క, జిల్లా కమిటీ సభ్యులు సైదమ్మ, సామ ఉపేంద్ర, జి.కావ్య, మంగమ్మ, జయసుధ పాల్గొన్నారు.

'ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం'

అనంతగిరి, ఫిబ్రవరి 28: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ములకలపల్లి రాములు విమర్శించారు. శుక్రవారం అనంతగిరిలో నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినప్పటికీ ఏ ఒక్క వాగ్దానం కూడా అమలు చేయలేదని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి పథకాలు ప్రకటించి నేటికీ అమలు చేయలేదని అన్నారు. ఇప్పటికైనా సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని, రైతుల పంటలు ఎండుతున్నా ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి రాపోలు సూర్యనారాయణ, మండల కమిటీ సభ్యులు వీరయ్య, సాదే కోటేశ్వరరావు, కొండమడుగుల వెంకటేశ్వర్లు, శ్రీను పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన

మోతె, ఫిబ్రవరి 28: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా గ్రీన్‌క్లబ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని రావిపహాడ్ ఎంపీపీఎస్, జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు ముప్పారపు నరేందర్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నిషేధిస్తే పర్యావరణాన్ని రక్షించినట్లు అవుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని కోరారు. కార్యక్రమంలో తల్లాడ రామచంద్రయ్య, కొక్కుల సంపత్, బండి పాపిరెడ్డి, అమృత రెడ్డి, ఎన్.పరమేశ్, శ్రీధర్‌రెడ్డి, నరసింహారెడ్డి, మోతిలాల్, నాగరాజు, వెంకన్న, సీనయ్య, రాంబాబు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పుల సంఖ్య పెంచాలి : డీఎంహెచ్‌ఓ

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 28: ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పుల సంఖ్యను పెంచాలని డీఎంహెచ్‌ఓ కోటాచలం అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో వైద్యుడు నక్క రవి, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలి

- రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 28: రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మిర్చి రైతులకు మద్దతు ధర, రుణమాఫీ, రైతుభరోసా, సన్నరకం వడ్లకు బోనస్ విషయాల్లో ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నదని విమర్శించారు. ప్రభుత్వ చర్యలు రైతులకు న్యాయం చేసేలా ఉండాలన్నారు.సీపీఐ నాయకుడు గుండు వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్, రమేశ్, వెంకన్న, పద్మ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'రైస్ మిల్లు కార్మికుల వేతనాలు పెంచాలి'

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

హుజూర్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 28: హుజూర్‌నగర్‌లోని రైస్ మిల్లుల్లో పనిచేస్తున్న డ్రైవర్లు, కార్మికుల వేతనాలు పెంచాలని టీఆర్‌ఎస్‌కేవీ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ అనుబంధ యూనియన్ల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలో నిర్వహించిన మిల్లు డ్రైవర్లు, కార్మికుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. డ్రైవర్లు, కార్మికుల వేతనాల ఒప్పందం గడువు ముగిసి రెండు సంవత్సరాలైనా నేటికీ మిల్లుల ఓనర్లు వేతనాలు పెంచకుండా శ్రమ దోపిడీ చేస్తున్నారని అన్నారు. వెంటనే కొత్త ఒప్పందం అమలు చేసి వేతనాలు పెంచాలని, ప్రత్యేక అలవెన్స్‌లు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆయా యూనియన్ల నాయకులు పచ్చిపాల ఉపేందర్, బెల్లంకొండ గురవయ్య, సలిగంటి జానయ్య, చలువాది సైదులు, చింతకాయల పర్వతాలు, ఇంటి తిరపయ్య, చౌప్పెర ఎర్రయ్య, ఎం.వీరబాబు, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ పనులను నిలిపివేయాలని వినతి

వినతి పత్రం అందజేస్తున్న తొండ గ్రామస్తులు

తిరుమలగిరి, ఫిబ్రవరి 28: మండల పరిధిలోని తొండ గ్రామంలో మైనింగ్ పనులను నిలిపివేయాలని కోరుతూ జిల్లా మైనింగ్ కార్యాలయ సిబ్బందికి గ్రామస్తులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గ్రామసభ నిర్వహించకుండా ఓ ప్రైవేట్ కంపెనీకి మైనింగ్ అనుమతులు ఇచ్చారని, అనుమతులు రద్దు చేయాలని కోరారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

నోటు పుస్తకాలను పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

గరిడేపల్లి, ఫిబ్రవరి 28: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని కీతవారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం నోటు పుస్తకాలు, కంపాస్ బాక్సులు పంపిణీ చేశారు. క్లబ్ జోన్ చైర్మన్ చల్లా ప్రభాకర్‌రెడ్డి సహకారంతో పంపిణీ చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు జిలకర రామస్వామి తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సువర్ణ, రిటైర్డ్ జీహెచ్‌ఎం చింతకుంట్ల పూర్ణచంద్రారెడ్డి, క్లబ్ సభ్యులు చిత్రం విశ్వనాథ్, ఉప్పాల లక్ష్మారెడ్డి, సరికొప్పుల నాగేశ్వర రావు, ఉపాధ్యాయులు నర్సిరెడ్డి, నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తే కేసులు

- పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రఘునందన్

మాల్, ఫిబ్రవరి 28 : రేషన్ దుకాణాల దగ్గర ప్రజా పంపిణీ బియ్యాన్ని స్థానికేతరులు కొనుగోలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈ విధంగా చేస్తే డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తాసీల్దార్ మాచన రఘునందన్ హెచ్చరించారు. చింతపల్లిలో రేషన్ దుకాణాలను శుక్రవారం ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. కిరాణా దుకాణాల యజమానులు కూడా రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్నట్లు తెలిసిందని ఈ విధంగా అక్రమాలకు పాల్పడితే జైలుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అదేవిధంగా వంట గ్యాస్ సరఫరాలో డీలర్లు ఇష్టారాజ్యంగా వసూళ్లు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని ఈ విధానం మానుకోవాలని సూచించారు.

అమ్మనబోలులో చట్టాలపై అవగాహన కల్పిస్తున్న తాసీల్దార్ వెంకటేశ్వర్‌రావు

చట్టాలపై అవగాహన ఉండాలి : తాసీల్దార్ వెంకటేశ్వర్‌రావు

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 28 : రాజ్యాంగంలో పొందుపర్చిన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగహన కలిగి ఉండాలని తాసీల్దార్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని అమ్మనబోలు గ్రామంలోని ఎస్సీ కాలనీలో శుక్రవారం పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పథకాలపై అవగాహన, అంటరానితనం, బాల్య వివాహాలు, ఎస్టీ, ఎస్సీ అట్రాసిటి నిరోధక చట్టం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

ఆయన వెంట ఎంపీడీఓ ఉమేశ్, ఏఆర్ఐ భవాని, పంచాయతీ కార్యదర్శి ఏలేందర్ ఉన్నారు.

ఆగిఉన్న లారీని ఢీకొన్న బైక్

- తండ్రి మృతి, కూతురుకు తీవ్ర గాయాలు

తీవ్రంగా గాయపడిన చిన్నారి నవ్య

దామరచర్ల, ఫిబ్రవరి 28 : మండల కేంద్రంలోని నార్కట్‌పల్లి-అద్దంకి ప్రధాన రహదారిపై శుక్రవారం ఆగి ఉన్న లారీని బైక్ వెనుక నుంచి ఢీ కొనడంతో తండ్రి మృతి చెందగా, కూతురుకి తీవ్ర గాయాలయ్యాయి. వాడపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం దురాజ్‌పల్లి గ్రామానికి చెందిన ఇరుదిండ్ల నవీన్(27) తల్లి లక్ష్మి ఆంధ్రాలోని కారంపూడి గ్రామంలో మిరుప కాయలు ఏరేందుకు వెళ్తుంటుంది. వారం క్రితం నవీన్ పెద్ద కుమార్తె నవ్యను వెంట తీసుకొని కారంపూడికి వెళ్లింది. చిన్నారికి జ్వరం వస్తుండడంతో కుమార్తెను ఇంటికి తీసుకొచ్చేందుకు నవీన్ బైక్‌పై కారంపూడికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో నార్కట్‌పల్లి-అద్దంకి ప్రధానరహదారిపై దామరచర్ల మండల కేంద్రం శివారులోకి రాగానే ఆగి ఉన్న లారీని అదుపు తప్పి వెనుక నుండి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో నవీన్‌కు, కుమార్తె నవ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108లో మిర్యాలగూడ ఏరియా దవాఖానకు తరలించగా నవీన్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. నవ్యకు చికిత్స అందిస్తున్నారు. చిన్నారి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నవీన్ భార్య గీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏఎంసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా మధు బాబు

మిర్యాలగూడ రూరల్, ఫిబ్రవరి 28 : టీఎంజీఓస్ మార్కెట్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడిగా పట్టణ వ్యవసాయ మార్కెట్‌కు చెందిన బి.మధుబాబు శుక్రవారం ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి దశరథ పర్యవేక్షణలో ఎన్నికలు జరగ్గా అసోసియేటెడ్ అధ్యక్షుడిగా శ్రీనాథ రాజు, ప్రధాన కార్యదర్శిగా ఉమామహేశ్వర్, కోశాధికారిగా ప్రవీణ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాస్‌రావు, జానకిరత్నం ఎన్నుకున్నారు.

అమరవీరుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలి : శంకర్ మాదిగ

నందికొండ, ఫిబ్రవరి 28 : ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో ప్రాణ త్యాగం చేసిన అమరుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇవ్వాలని, వారిలో ఒక కుటుంబానికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ స్థానాన్ని కేటాయించాలని దండోరా రాష్ట్ర అధ్యక్షుడు కొంగరి శంకర్ మాదిగ అన్నారు. నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని విజయ విహార్‌లో రెండ్రోజులుగా జరుగుతున్న దండోర రాష్ట్ర మహాసభల్లో భాగంగా శుక్రవారం ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్లు చిలుక రాజనర్సిమాదిగ, చింతల శ్యామ్, సగ్గి సామ్రాట్ ప్రకాశ్ మాదిగ, రేణికుంట్ల కుమార్‌మాదిగ, దొడ్డె రాజేంద్రప్రసాద్ మాదిగ, వర్కిల్లా రాజయ్య మాదిగ, రాజ్‌కుమార్, శివాజి పాల్గొన్నారు.

కులగణనతో అందరికీ మేలు

- వెనుకబడిన తరగతుల రాష్ట్ర కమిషన్ సభ్యుడు సురేందర్

మాట్లాడుతున్న వెనుకబడిన తరగతుల రాష్ట్ర కమిషన్ సభ్యుడు సురేందర్

మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 28 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కులగణన సర్వే వల్ల అన్ని కులాలు, వర్గాలకు మేలు జరుగుతుందని వెనుకబడిన తరగతుల రాష్ట్ర కమిషన్ సభ్యుడు తిరుమలగిరి సురేందర్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కులగణన దోహదపడుతుందన్నారు. కులగణనలో పాల్గొనని వారు ఆన్‌లైన్‌లో, ప్రత్యక్షంగా వివరాలు సమర్పించేందుకు ఈ నెల 14 నుంచి 28వరకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. కార్యక్రమంలో జిల్లా డీబీసీడబ్ల్యూ ఇన్‌చార్జి ఎండి.ఖాజాఅలీ, మున్సిపల్ కమిషనర్ ఎండి.యూసుఫ్, తాసీల్దార్ హరిబాబు, ఏబీసీడబ్ల్యూఓ ఎస్తేర్, మున్సిపల్ డీఈఈ వెంకన్న ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



నాగరాజు కుమార్తెకు చెక్కును అందిస్తున్న స్నేహితులు

శాలిగౌరారం, ఫిబ్రవరి 28 : మండల పరిధిలోని శాలిలింగోటం గ్రామానికి చెందిన మాగి నాగరాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న శాలిగౌరారం జడ్పీహెచ్‌ఎస్‌లో 2004-05లో నాగరాజుతో పాటు పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ.50వేలను సమీకరించి శుక్రవారం మృతుడి కుమార్తెకు సంబంధిత చెక్కును అందించారు. కార్యక్రమంలో దీటి కుమార్, యాదగిరి, సతీశ్, పడాల అయోధ్య, మల్లయ్య, శంకర్ ఉన్నారు.

కట్టంగూర్ : మండల కేంద్రంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన అవుల వెంకయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నలగాటి ప్రసన్నరాజ్ శుక్రవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మాజీ మండలాధ్యక్షుడు ఊట్కూరి ఏడుకొండలు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నూక సైదులు, నాయకులు మేకల రమేశ్, గుండాల మల్లేశ్, మేకల రమేశ్, మాతంగి యాదయ్య, చంద్రయ్య, కృష్ణయ్య, వెంకన్న, సతీశ్, జానయ్య ఉన్నారు.

విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 28: మండలంలోని రామాపురం గ్రామంలో ఓ విద్యార్థిని అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ పరమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. రామాపురంలోని తన అమ్మమ్మ ఇంట్లో ఉంటూ కోదాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెకండియర్ చదువుతున్న విద్యార్థిని నాలుగు రోజుల క్రితం కాలేజీకి వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదు. తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఫలితం లేకపోవడంతో ఆమె తాత స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. కాగా, విద్యార్థినికి ఇన్‌స్టాగ్రాంలో కోదాడ మండలానికి చెందిన ఓ యువకుడితో పరిచయం ఏర్పడగా, ఆమె బంధువులు యువకుడిని ఇటీవల ఫోన్‌లో మందలించినట్లు తెలిసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పుస్తెలతాడు చోరీ

చివ్వెంల, ఫిబ్రవరి 28: మహిళ మెడలోని పుస్తెలతాడు అపహరించిన ఘటన మండలంలోని మోదిన్‌పురం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నారెడ్డి ధనమ్మ గురువారం రాత్రి ఇంట్లో ఒంటరిగా ఉండగా, గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి ఆమె మెడలోని 4 తులాల బంగారు పుస్తెలతాడు తెంపుకొని పారిపోయాడు. ఈ ఘటనలో ధనమ్మ మెడకు, తలకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం బాధితురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ మహేశ్వర్ తెలిపారు.

ఆర్టీసీ కంట్రోలర్ నిజాయితీ

చందంపేట(దేవరకొండ), ఫిబ్రవరి 28 : దేవరకొండ ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ మహిళా ప్రయాణికురాలు తన మొబైల్ ఫోన్‌ను మర్చిపోయి వెళ్లింది. అక్కడే విధులు నిర్వహిస్తున్న కంట్రోలర్ దశరథకు మొబైల్ దొరకగా.. భద్రపర్చి విచారణ జరిపి బాధితురాలికి సెక్యూరిటీ గార్డ్ సమక్షంలో శుక్రవారం అప్పగించారు.

సోమేశ్వర జ్ఞానపీఠంతో చెర్వుగట్టు ఆలయానికి సంబంధం లేదు : ఈఓ నవీన్

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 28 : చెర్వుగట్టు గ్రామ సమీపంలో ఉన్న సోమేశ్వర జ్ఞానపీఠానికి, చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయానికి సంబంధం లేదని ఈఓ నవీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొంతమంది అర్చకులు సోమేశ్వర జ్ఞానపీఠం వద్ద శివుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించి అక్కడికి రావాలని చెర్వుగట్టుపై ప్రచారం చేస్తున్నారని, ఇది సరైంది కాదని సూచించారు. భక్తుల మనోభావాలు దెబ్బతీయకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కోరారు.

ఎఫ్‌సీఐతో ఆస్పత్రుల ఎంప్యానెల్ మెంట్‌కు దరఖాస్తులు

నల్లగొండ, ఫిబ్రవరి 28 : ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మిల్లర్ల నుంచి సీఎంఆర్ ధాన్యం సేకరిస్తూ ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తున్న భారత ఆహార సంస్థ కార్యాలయంతో ఆసక్తి కలిగిన అర్హులైన ఆస్పత్రుల యాజమాన్యం ఎంప్యానెల్‌మెంట్ అయి తమ ఉద్యోగులకు సేవలందించవచ్చని డీఎం సునీల్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల్లో సంస్థకు చెందిన 150 మంది ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల కోసం ఎంపానెల్‌మెంట్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే బిల్లులు సైతం సత్వరమే అందివ్వనున్నట్లు తెలిపారు.

'ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి'

త్రిపురారం, ఫిబ్రవరి 28 : కాంగ్రెస్ ఎన్నికల్లో ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని ఎంసీపీఐయూ జిల్లా సహాయ కార్యదర్శి పోతుగంటి కాశి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు భరత్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేసి అనంతరం తాసీల్దార్ గాజుల ప్రమీలకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్నారు.

అందుబాటులో యూరియా : ఏఓ

ఆత్మకూర్.ఎస్, ఫిబ్రవరి 28: యాసంగి సాగుకు రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉన్నదని మండల వ్యవసాయాధికారి దంతాల దివ్య తెలిపారు. మండల పరిధిలోని ఏపూరు, నెమ్మికల్ పీఏసీఎస్ కేంద్రాల్లో యూరియా పంపిణీని శుక్రవారం పరిశీలించారు.

అడవిదేవులపల్లి : ఉల్సాయిపాలెం ప్రాథమిక పాఠశాల చిన్నారులతో ఉపాధ్యాయులు

త్రిపురారం : అంజనపల్లి ప్రాథమిక పాఠశాలలో..



చిట్యాల : పెద్దకాపర్తి ప్రాథమిక పాఠశాలలో..

స్వపరిపాలన దినోత్సవం

అడవిదేవులపల్లి, ఫిబ్రవరి 28 : మండలంలోని ఉల్సాయిపాలెం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు హెచ్‌ఎం బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

త్రిపురారం : మండలంలోని అంజనపల్లి ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు హెచ్‌ఎం సుధారాణి బహుమతులు అందించారు. ఉపాధ్యాయులు లచ్చిరాం పాల్గొన్నారు.

చిట్యాల : మండలంలోని పెద్దకాపర్తి ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం జరిపారు. కార్యక్రమంలో ఎంఈఓ సైదానాయక్, ఎస్ఐ ఎన్. ధర్మ, హెచ్‌ఎం నకిరేకంటి శ్రీధర్, ఉపాధ్యాయులు ఎ. భవానీ, ఎన్. మంజుల, తిమ్మయ్య పాల్గొన్నారు.